

సన్నాయి మోగుతూంది.

పెద్దవాళ్ళు పనుల హడావిడితో అటూ ఇటూ తిరుగుతున్నారు. పిల్లలు పనిలేకుండానే హడావిడి పడిపోతున్నారు.

పురోహితుడు మంత్రాలు చదువుతున్నాడు. పందిట్లో ఓ మూలగా కూచుని అప్పుడప్పుడు సన్నాయి వాయిస్తున్నాడు ఒక ప్రక్కన ముసలివాడు. ఊపిరి పోయటానికి ఓపిక లేని ముసలికి. అయినా సన్నాయి అలవాటు వల్ల పలుకుతూంది.

అప్పుడప్పుడు అపశ్రుతి ధ్వనిస్తూనే ఉంది. ఆపి ఆపి వాయిస్తూనే ఉన్నాడు.

"పెళ్ళికూతుర్ని తీసుకురండి." పురోహితుడు అరిచాడు.

ముగ్గురు నలుగురు ముత్తైదువులు లోపలికి వెళ్ళారు గబగబా.

"మేనమామ...మేనమామ..." అరుస్తున్నారెవరో.

గౌరీపూజ చేసి బుట్టలో ముడుచుకుని కూర్చుని ఉంది సీత. గుండెల్లో గడ్డకట్టిన బాధ కళ్ళ అంచుల్లో తొంగి చూస్తూంది.

నలభయ్యో పడిలో నడుస్తున్న వరుడు రఘునాథం పెదవుల మీద మందహాసం లాస్యం చేస్తూంది.

పెద్దరికం తెచ్చిపెట్టుకుని ఏం చెయ్యాలో తెలియక అటూ ఇటూ తిరుగుతున్న మంగ ముఖంలో అవ్యక్తమైన విషాదం అలుముకొని ఉంది.

# కన్నీళ్ళు

- బి. టి. పద్మినీదేవి

పెళ్ళికూతుర్ని మేనమామ సాయంతో తీసుకువచ్చారు. పీటలమీద కూర్చో పెట్టారు.

బంగారుబొమ్మలాంటి పిల్ల. పట్టుమని పద్దెనిమిదేళ్ళు లేవు.

కాకి ముక్కుకు దొండపండులా గుంది.

ఏం చేస్తారు? కట్నాలు పొయ్యంది మంచి సంబంధాలు రావాయె!

ఎంతమంది పెళ్ళిళ్ళు మానుకుని చదివి సంపాదిస్తూ ఉండలేదూ? ఈ పెళ్ళికన్నా మానడమే నయం.

పందిట్లో ఎవరికి తోచిన రీతి వా రనుకుంటున్నారు. సీత తల వంచుకొని కూచుంది. సిగ్గుతో కాదు, గుండెల్లో బాధ...బరువుతో.

రఘునాథానికి పిల్లలున్నారు. ఆడపిల్లకి పన్నెండేళ్ళు. మరో ఇద్దరు మగపిల్లలు.

పన్నెండేళ్ల ఆడపిల్ల ఊహ తెలిసిన పిల్ల. "అమ్మ" అనే మాటకి అర్థం తెలిసిపోయిందా వయస్సుకు. ఆ స్థానం పవిత్రత మీద గౌరవం ఏర్పడిపోయిందా మనస్సుకి. ఆలోచనలు పెంచి అభిప్రాయాలు స్థిరపడే తరుణం.

"అమ్మకి బదులు మరో అమ్మ..." ఆ మాటలు వినే ఓర్పు ఉంటుందా పిల్లకు. "మరో అమ్మ" అనగానే "ఛీ" అనుం టుంది.

రాబోయే సవతితల్లిని ఎలా ఊహించుకుంటుంది?

రాక్షసిగా, బ్రహ్మరాక్షసిగా! తన కోసమే పుట్టిన దెయ్యంగా!

కోపం, అసహ్యం, కసి, ద్వేషం కలిసిన కళ్ళు అత్తవారింటికి వెళ్ళే కొత్త కోడలికి స్వాగతం పలుకుతాయి.

పసిపిల్లయితే ఎత్తుకొని బుజ్జగించి, "మీ అమ్మ పంపింది" అనో, లేకపోతే "నేనే మీ అమ్మని" అనో చెప్పవచ్చు.

కాని పన్నెండేళ్ల వయస్సు. "నువ్వే మా అమ్మని మింగేశావ్" అన్నట్లు చూసే చూపు. చేతనయితే మింగేద్దా మనేట్లు ఉండే చూపు.

సీత గుండెల్లో బాకులు దూసు కుంటున్నాయి.

తండ్రి రెండో పెళ్ళి పిల్లలు చూడకూడదుట. పిల్ల అందుకే రాలేదు.

ఇప్పుడు పెళ్ళికి రాకపోతేనేం, ఇంటికి వెళ్ళగానే ప్రత్యక్షమౌతారుగా!

మంత్రాలు చదువుతూ ఉన్నాడు పురోహితుడు. ఆ మంత్రాలు సంస్కృతంలో ఉన్నాయి. అతను తప్పు చదువుతున్నాడో, ఒప్పు చదువుతున్నాడో ఎవరికి తెలుసు గనక!

ముసలివాడు సన్నాయి పాడే పాటలో అక్కడక్కడ అపశ్రుతి కొందరికి వినబడుతూనే ఉంది.

రఘునాథం కాళ్లు కడుగుతున్నాడు కామేశం. నీళ్లు పోస్తోంది మంగ. సీత పక్కగా నిలబడ్డ మంగ వంగి రఘునాథం పాదాల మీదికి నీళ్ళు వంపుతూంది.

సీత తల ఎత్తలేదు. కొద్దిగా కన్ను లెత్తి చూసింది. సవతితల్లికి స్వాగతం చెప్పబోయే పిల్లల గుండెల్లో ఊహలు తనకి ఇదివరకే తెలుసు. కాని ఏ పరిస్థితిలో ఒక కన్నెపిల్ల తన కలలని కల్లలు చేసుకుని ఒక విధురుడికి వధు వౌతుందో ఇప్పుడే తెలిసింది.

*అమ్మ అంటే అర్థం తెలియని దశలో అమ్మగా ఎవరిని అయినా అంగీకరించడానికి అభ్యంతరం ఉండదు; అయిష్టం ఉండదు; ఎదురు తిరగడం అసలే ఉండదు. అమ్మ అంటే అర్థం తెలుసుకొన్న తరవాత — కొందరు జీవితంలో ఎన్నడూ తెలుసుకోలేరేమో — అందునా అమ్మను పోగొట్టుకొన్న తరవాత అమ్మను మరిచి మరొకరిని ఎవరిని అయినా అమ్మగా అంగీకరించడం ఎంతైనా కష్టం.*

మంగ కళ్ల చివర ఉబుకుతున్న నీరు తుడుచుకుంటూంది.

సీత మళ్లీ బరువుగా తలవంచుకుంది, సూత్రధారణ అయిపోయింది.

తలంబ్రాలు పోసుకోవటం ముగిసింది, సీత రఘునాథానికి అర్ధాంగి అయింది.

పెళ్లి కావటమేమిటి, ముగ్గురు పిల్లల తల్లి కావటమేమిటి ఒకేసారి జరిగిపోయాయి.

సీత రఘునాథం భార్య అయింది. ఆ పిల్లలకు మాత్రం సవతితల్లి అయింది.

ఆస్తి, అంతస్తు ఉన్నా ఇలాంటి సంబంధానికి ఇయ్యనే ఇయ్యరు.

ఇక ఇలాంటి పెళ్ళికి వైభోగా లేముంటాయి? పెళ్లి భోజనాలు, అప్పగింతలు అన్నీ సాయంత్రానికల్లా అయిపోయాయి.

సీత అత్తవారింటికి వెళ్ళబోతూంది. అందరికి చెబుతూంది వెళుతున్నానని.

మంగ గదిలోకి వెళ్లిపోయింది. ఒంటరిగా నిలబడిపోయింది.

సీత మెల్లగా లోపలికి వచ్చింది.

మంగ కళ్లనిండుగా నీళ్ళు. బలంగా కింది పెదవిని పళ్లతో అదిమి పట్టింది మంగ. ముఖం ఎర్రబడింది.

"పిన్నీ!" సీత కంఠం వణికింది.

"సీతా!" మంగ రెండు చేతులతో ముఖం కప్పేసుకుంది.

సీత మనస్సు ఆగలేదు. ఒక్కసారిగా వెళ్లి మంగను చుట్టేసుకుంది. మంగ గుండెల్లో తల పెట్టుకుంది సీత.

కన్నీళ్ళు ఇద్దరికీ ఆగలేదు.

మంగ కొంచెం సంబాళించుకుంది.

"నీవైనా అదృష్టవంతురాలివికాలేదు, సీతా" అంది పూడుకుపోతున్న గొంతుతో.

"పిన్నీ, నిన్నెంతో తిట్టుకున్నాను. ఈ రెండేళ్ళు నిన్ను శత్రువుగా చూశాను. కాని ... కాని ... నేనూ ... నేనూ అంతే. నువ్వు మంచిదానివి. పిన్నీ, నేను అర్థం చేసుకోలేకపోయాను"

సీత మంగ కాళ్లకు నమస్కరించింది.

కన్నీళ్ళు ముత్యాలై సీత నెత్తిన అక్షతలైనాయి. ★



మీ కష్టాలన్నీ స్వయంగా చూడటం చాలా సంతోషం!